క్లుప్తంగా

ధరణి సేవలకు అంతరాయం



తహసీల్ కార్యాలయంలో వేచియున్న ప్రజలు

ఇందల్వాయి: తహసీల్ కార్యాలయంలో ధరణి వెబ్‌సైట్ సేవలు సోమవారం గంటల కొద్ది నిలిచిపోయాయి. సర్వర్‌లో అంతరాయం ఏర్పడటంతో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు తీవ్ర అసహనానికి లోనయ్యారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వేచి ఉన్నా పనులు పూర్తి కాకపోవడంతో నిరాశకు లోనయ్యారు. ధరణి వెబ్‌సైట్ తరుచూ మొరాయిస్తుందని, అరగంటలో పూర్తి కావాల్సిన రిజిస్ట్రేషన్లు గంటల పాటు సాగుతున్నాయని ప్రజలు ఉసూరుమంటున్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి తుకారాం

ఇందల్వాయి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా నివారణ శాఖాధికారి తుకారాం రాథోడ్ సోమవారం తనిఖీ చేశారు.గన్నారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరోగ్య సిబ్బంది అకారణంగా సెలవు పెట్టవద్దని, ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. హెచ్ఈవో శంకర్, డీపీఎంవో శ్రీనివాస్, సీహెచ్‌వో జేమ్స్ న్యూటన్, అక్బర్ అలీ, వెంకట్ రెడ్డి తదితరులున్నారు.

సిరికొండ పోలీస్ స్టేషన్..



రికార్డులు పరిశీలిస్తున్న సీపీ సాయి చైతన్య

సిరికొండ: సిరికొండ పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను ఆయన పరిశీలించారు. నేరాల నమోదు ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల గురించి సిబ్బందిని ప్రశ్నించారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై ఎల్. రామ్, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంతోషిమాత ఆలయం పరిశీలన



సహాయ కమిషనర్‌ను సన్మానిస్తున్న నేతలు

నిజామాబాద్ రూరల్: నగరంలోని నాందేవ్‌వాడలో గల సంతోషిమాత సాయిబాబా దేవస్థానం పునర్‌నిర్మాణం జరిగి దేవతా ప్రతిష్ఠకు సిద్ధమవుతున్న ఆలయాన్ని దేవాదాయ ధర్మాదాయశాఖ నిజామాబాద్ జిల్లా సహాయ కమిషనర్ విజయరామారావు సోమవారం సందర్శించి పనులను పరిశీలించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నేతలు

సిరికొండ: గడ్కోల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కాంగ్రెస్ నేతలు ప్రారంభించారు. మసీదు గల్లీలో, బస్టాండ్‌లో సీసీ రోడ్లకు రూ.10 లక్షలు, సొసైటీ గోదాం నుంచి వాటర్ ట్యాంకు వరకు సీసీ డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి మంజూరు చేశారని వారు తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్ రొక్కం సంపత్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మామిడి రాములు, భానుచందర్, భాస్కర్ రెడ్డి, వెల్మ రాజేందర్‌రెడ్డి, అఖిల్ యాదవ్, నవీన్‌రెడ్డి, ప్రసాద్, కట్ట గవాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పదవికి గౌరవం ఇవ్వాలి

- అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతాం
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కు కాంగ్రెస్ నేతల హెచ్చరిక



మాట్లాడుతున్న టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, అమృతాపూర్ గంగాధర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): ఎమ్మెల్యే పదవికి ప్రతి ఒక్కరూ తగిన గౌరవం ఇవ్వాలని టీపీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. పదవికి, వయసుకు గౌరవం ఇవ్వకుండా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్..రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని ఇటుక బట్టీల ఎమ్మెల్యే అని పేర్కొనడం సిగ్గు చేటని మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డిచ్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్‌తో కలిసి శేఖర్‌గౌడ్ మాట్లాడారు. 20 ఏళ్లుగా తెలంగాణ ఉద్యమ నాయకుడిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా ప్రజా సేవలో భూపతిరెడ్డి కొనసాగుతున్నారని తెలిపారు. బీజేపీ తరఫున 8 మంది ఎంపీలు ఉండి తెలంగాణ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి దివాలా తీయించినా, అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను నెరవేరుస్తుందన్నారు. రూరల్ అభివృద్ధికి సుమారు రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఘనత భూపతిరెడ్డికి దక్కుతుందన్నారు.

బ్రిడ్జిల నిర్మాణం కేంద్ర ప్రభుత్వ బాధ్యత..

రైల్వే బ్రిడ్జిల నిర్మాణం అనేది కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, ఎంపీ అర్వింద్ ఏళ్లు గడుస్తున్నా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయించలేకపోతున్నారని విమర్శించారు. జిల్లాకు మంజూరు చేసిన పసుపు బోర్డును కూడా తూతూ మంత్రంగా ఏర్పాటు చేసి రైతులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న కులాచారి దినేష్‌కుమార్ ఇప్పటికే మూడు పార్టీలు మార్చారన్నారు. అభివృద్ధి విషయంలో ఏవైనా సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామని కానీ తప్పుడు ఆరోపణలు చేస్తే గుణపాఠం చెబుతామన్నారు. నిజాయితీకి మారుపేరుగా నిలిచే ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై ఇష్టమెచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ నేతలు ఊరుకోరని హెచ్చరించారు. నాయకులు అగ్గు బోజన్న, భాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, నవీన్‌గౌడ్, శ్యాంసన్, వాసుబాబు, ధర్మాగౌడ్, గంగారెడ్డి, మోహన్‌నాయక్, సంతోష్‌రెడ్డి, సాయారెడ్డి పాల్గొన్నారు.

మమ్మల్ని రాజకీయాల్లోకి లాగకండి

- ఇటుక బట్టీల యజమానుల వినతి



మాట్లాడుతున్న ఇటుక బట్టీల యజమానులు

డిచ్‌పల్లి: అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య ఎన్నో రాజకీయ విమర్శలు, ఆరోపణలు ఉంటాయని, అయితే ఆ రాజకీయాల్లోకి తమను లాగవద్దని ఇటుక బట్టీల యజమానులు వేడుకుంటున్నారు. సోమవారం నడిపల్లి శివారులో ఇటుక బట్టీల యజమానులు మాట్లాడారు. తామంతా పొట్టకూటి కోసం కుటుంబ పోషణలో భాగంగా ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకొని నిబంధనల మేరకు ఇటుక బట్టీలను నడుపుకుంటున్నామని తెలిపారు. వలస కూలీలకు ఆసరాగా నిలబడుతూ, రాజకీయాలకు అతీతంగా బతుకుతున్న తమను కొన్ని పార్టీల నాయకులు అనవసరంగా రాజకీయాల్లోకి లాగడం ఆవేదన కలిగిస్తుందన్నారు. తమను రాజకీయాల్లోకి లాగవద్దని విజ్ఞప్తి చేశారు. ఇటుక బట్టీల యజమానులు ఎస్.మురళి, కె.నారాయణ, ఎ. అంజిబాబు, కె.శ్రీనివాసరావు, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

డిచ్‌పల్లి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించాలని డిచ్‌పల్లి మండల ఆశావర్కర్స్ సంఘం అధ్యక్షురాలు బొడికె శోభ డిమాండ్ చేశారు. సోమవారం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు ఆశావర్కర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆశావర్కర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆశావర్కర్ల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలపై ఈ నెల 19న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



మోపాల్‌లో దీక్షలు ప్రారంభించిన ఎమ్మార్పీఎస్ నేతలు

- మోపాల్‌లో రిలే దీక్షలు ప్రారంభం

మోపాల్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా తక్షణమే చట్టబద్ధత కల్పించి అన్ని ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణను అమల్జేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గంధమాల నాగభూషణం మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మోపాల్ మండల కేంద్రంలో ఇన్‌ఛార్జి సంగం కృష్ణయ్య ఆధ్వర్యంలో రిలే దీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. 75 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ల ఉమ్మడి విధానం వల్ల మాదిగలకు తీరని నష్టం జరిగిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణ అమల్జేయకుండా గ్రూప్ 1, 2, 3 ఫలితాలు విడుదల చేయవద్దని, అలా చేస్తే మాదిగలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, ఎర్రోళ్ల సుధాకర్, కిషన్, గంగాధర్, తెడ్డు రవి, కాకి లక్ష్మి, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.



ఇందల్వాయిలో దీక్షలో కూర్చున్న నేతలు

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆలస్యం చేయకుండా ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధం చేయాలని, గ్రూప్స్ ఉద్యోగాల్లో మాదిగలకు న్యాయం చేయాలని నేతలు డిమాండ్ చేశారు. మండల నాయకులు బుర్రన్న, మహేందర్, మచ్చేందర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

టీచర్‌ను సస్పెండ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నిజామాబాద్ అర్బన్: భీమ్‌గల్ మండలం పల్లికొండ జెడ్పీ హైస్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థిపై దాడి చేసిన టీచర్ భూమేశ్వర్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారికి పీడీఎస్‌యూ ఆర్మూర్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి దాడి ఘటనలు జరగకుండా పాఠశాలలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని అధికారిని పీడీఎస్‌యు జిల్లా అధ్యక్షుడు నరేందర్ కోరారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్.అనిల్, జిల్లా నాయకులు వినోద్, అరుణ్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన మానాల



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న మోహన్‌రెడ్డి

నిజామాబాద్ సిటీ: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన శంకర్ నాయక్‌ను డీసీసీ అధ్యక్షుడు, కో–ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కలిశారు. సోమవారం హైదరాబాద్‌లో కలిసి శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దమ్మ తల్లి వార్షికోత్సవాలకు ఆహ్వానం



ధర్పల్లి: ధర్పల్లి మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి జరిగే పెద్దమ్మ తల్లి ఆలయ 26వ వార్షికోత్సవాలకు రావాలని మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపిని ముదిరాజ్ సంఘం సభ్యులు సోమవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం మాజీ ఎంపీపీ రూ.10 వేలను ముదిరాజ్ సంఘం సభ్యులకు విరాళంగా అందజేశారు.

ధ్రువపత్రాల పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): దివ్యాంగుల పునరావాస పథకం క్రింద నాన్ బ్యాంక్ లింకేజీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని సోమవారం మున్సిపల్ కమిషనర్ నారాయణ తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్న పట్టణ పరిధిలోని దివ్యాంగులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మంగళవారం బల్దియా కార్యాలయానికి రావాలని సూచించారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నేతలు

నిజామాబాద్ అర్బన్: పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి.. మాస్ కాపీయింగ్‌ను అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేరు పొందిన కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ర్యాంకుల కోసం పరీక్షా కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కవుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యా సంస్థలు.. విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేస్తూ ముందస్తుగా అడ్మిషన్లు చేసుకుంటున్నాయన్నారు. పీడీఎస్‌యూ నాయకులు దివిక, మనోజ్, సాయి కిరణ్, గౌతం, చరణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూలో చేరిన బార్దాన్ కార్మికులు

సీఐటీయూలో చేరిక

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో పని చేస్తున్న 250 బార్దాన్ కార్మికులు సీఐటీయూలో చేరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబులు కండువాలు కప్పి వారిని ఆహ్వానించారు. అనంతరం వారు కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం, భద్రత కల్పించడం, మౌలిక సౌకర్యాల కల్పనకు యూనియన్ పోరాడుతుందన్నారు. హక్కుల సాధనకు అసంఘటిత కార్మికులైన బార్దాన్ కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు రాము, ఇమామ్, విజయ్, రాజు పాల్గొన్నారు

రేపు తైబజార్ వేలం

బాల్కొండ: మండల కేంద్రంలో జీపీ ఆధ్వర్యంలో బుధవారం తైబజార్ వేలం నిర్వహిస్తున్నట్లు జీపీ కార్యదర్శి రజనీకాంత్‌రెడ్డి సోమవారం తెలిపారు. వార సంతకు రూ. 50 వేలు, రోజువారి సంతకు రూ.35 వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. ఉదయం 10.30 గంటలకు జీపీ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామని చెప్పారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,700	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	82,787		– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	75
బీరకాయ	40	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	40	60	గోబిపువ్వు	10	20
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	50	75
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	30	50			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 దిల్‌రూబా(తెలుగు)-11.00, 4.35, 7.30, 10.25 -ఛావా(హిందీ)-1.40
స్క్రీన్-2 యుగానికి ఒక్కడు(తెలుగు)-11.00, 4.40 కోర్ట్(తెలుగు)-1.45, 7.35, 10.30
స్క్రీన్-3 ఆఫీసర్ ఆన్ డ్యూటీ (తెలుగు)-1.30, 7.30 -ఛావా(తెలుగు)-4.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 ఛావా(తెలుగు)-10.00, 4.15 ఆఫీసర్ ఆన్ డ్యూటీ(తెలుగు)-1.20 కోర్ట్(తెలుగు)-7.35, 10.40
స్క్రీన్-2 కోర్ట్(తెలుగు)-10.00, 4.25 ఛావా(తెలుగు)-1.05, 7.30 ఛావా(హిందీ)-10.50
స్క్రీన్-3 ఛావా(హిందీ)-10.30, 1.50 ల్యాంప్(తెలుగు)-5.10 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-7.35 యుగానికి ఒక్కడు(తెలుగు)-10.45
స్క్రీన్-4 దిల్‌రూబా(తెలుగు)-10.15, 4.10, 7.20, 10.30 1000 వాలా(తెలుగు)-1.25

లలితామహల్ కోర్ట్ (తెలుగు)
దేవి దిల్‌రూబా(తెలుగు)
నటరాజ్ యుగానికి ఒక్కడు (తెలుగు)
విజయ్ ఛావా (తెలుగు)

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాల నిర్లక్ష్యం



నగరంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

నిజామాబాద్ సిటీ: సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ధర్నాచౌక్‌కు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సీఐటీయూ నాయకులు ధర్నాకు మద్దతు తెలిపారు. అనంతరం నాయకులు జైశంకర్ గౌడ్, నూర్జహాన్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నాయని మండిపడ్డారు. అంగన్‌వాడీ వ్యవస్థలో జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెడితే అంగన్‌వాడీల ఉద్యోగ భద్రతకే ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు రమేశ్ బాబు, స్వర్ణ, చంద్రకళ, మంగాదేవి, వాణి, జ్యోతి, కరుణ పాల్గొన్నారు.

సీలింగ్ భూములను పేదలకు పంచాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకులు ప్రభాకర్

సిరికొండ: హుస్సేన్‌నగర్ శివారులో గల సర్వే నెంబర్ 836లో గల సీలింగ్ భూములను పేదలకు ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. ప్రభాకర్ మాట్లాడుతూ.. ఆ భూమిని గ్రామానికి చెందిన 70 మంది వ్యవసాయ కూలీలు గత పదిహేనేళ్లుగా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. కొందరు పైరవీకారులు ఒక ముఠాగా ఏర్పడి కొంతమంది వద్ద రూ.లక్ష, రెండు లక్షల చొప్పున వసూలు చేస్తూ ఆ భూమిని పట్టా చేపిస్తామంటూ పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ స్పందించి పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ, రమేశ్, దామోదర్, పుష్పలత, భూమేశ్వర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి



శుభం కరోతి గణపతి ఆలయంలో భక్తులకు హారతి ఇస్తున్న పురోహితుడు

నిజామాబాద్ రూరల్: నగరంలో సంకష్టహర చతుర్థి భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సార్వజనిక్ గణేష్ మండలి గణపతి ఆలయం, మహాగణపతి దేవాలయం(బొడ్డెమ్మ చెరువు వద్ద), సిద్ధి వినాయక స్వామి దేవాలయం(గాయత్రి నగర్), శుభం కరోతి గణపతి ఆలయం(మున్సిపల్ వద్ద), లక్ష్మీ గణపతి మహా ఆలయం(బోర్గం)లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.



గాయత్రినగర్‌లోని సిద్ధివినాయక స్వామి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

విద్యార్థులు ఉన్నత స్థానంలో నిలవాలి



విద్యార్థులతో అధికారి నాగోరావు, ఉపాధ్యాయులు

సిరికొండ: విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉన్నత స్థానంలో నిలవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి నాగోరావు ఆకాంక్షించారు. మండల కేంద్రంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాగోరావు మాట్లాడుతూ.. భయం లేకుండా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. తహసీల్దార్ రవీందర్ రావు, ఎంపీవో తారాచంద్, హెచ్ఎం భోజరామ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.